సాక్షి ఖమ్మం

గురువారం । 21 । ఆగస్టు । 2025



ఎట్టకేలకు 'సుడా' ముసాయిదా

'సుడా' మాస్టర్ ప్లాన్ ముసాయిదాను విడుదల చేయగా.. కొన్ని ప్రాంతాల్లోనే ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది. 8లో



వేగంగా ఇళ్ల నిర్మాణం

'ఇందిరమ్మ' లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 24°

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు, పిండిప్రోలులో ఆర్అండ్‌బీ, పీఆర్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక, పిండిప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తారు. ఆతర్వాత నేలకొండపల్లి మండలం బోదులబండల హైస్కూల్‌లో విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేయనున్న మంత్రి, పలు గ్రామాల్లో నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు.

ప్రణాళికాయుతంగా భూసేకరణ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ ప్రణాళికాయుతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి భూసేకరణపై సమీక్షించారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి ఇంకా అవసరమైన 1,814 ఎకరాల భూసేకరణకు అధికారులు రైతులతో చర్చించాలని తెలిపారు. కొన్ని ప్యాకేజీలకు నోటిఫికేషన్ జారీ చేయగా, మిగతా చోట్ల నోటిఫికేషన్ ఇవ్వాలని సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఉద్యోగులు షాజియా సుల్తానా, బి.అర్జున్, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఎరువులు

చింతకాని: జిల్లా రైతుల అవసరాల కోసం మరో దఫా ఎరువులు చేరుకున్నాయి. చింతకాని మండలం పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు బుధవారం చేరిన స్పిక్ కంపెనీ ఎరువులను డీఏఓ డి.పుల్లయ్య పరిశీలించి మార్క్‌ఫెడ్, డిస్ట్రిబ్యూటర్లకు కేటాయించారు. ఈ విడతలో 964.80 మెట్రిక్ టన్నుల యూరియా, 127.60 మె.టన్నుల డీఏపీ, 446.60 మె.టన్నుల 20.20.0.13, 63 మె.టన్నుల 10.26.26, 63.80 మెట్రిక్ టన్నుల జీఎస్ఎస్‌పీ చేరిందని ఆయన తెలిపారు. రైతులకు సరిపడా ఎరువులు ఉన్నందున ఆందోళనకు గురికావొద్దని సూచించారు. రేక్ పాయింట్ ఆఫీసర్, ఏఓ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సైబర్' బాధితులకు న్యాయం జరిగేలా విచారణ



వీసీలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: సైబర్ నేరస్తుల చేతిలో మోసపోయిన వారికి నగదు అందే వరకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. నేరస్తుల ఖాతాలను స్తంభింపచేయడమే కాక బాధితులకు నగదు అందే వరకు తీసుకోవాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సీపీ అధికారులకు సూచనలు చేశారు. సైబర్ మోసాన్ని గుర్తించాక త్వరగా ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందనే విషయంలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు అందితే నిందితుల ఖాతాలను స్తంభింపజేయడం, బాధితులకు రీఫండ్ చేయడం సులభమవుతుందని తెలిపారు. ఈమేరకు బాధితులు 1930 నంబర్‌కు లేదా cybercrime.gov.in పోర్టల్‌లో సాధ్యమైనంత త్వరగా ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో ఏసీపీలు ఫణీందర్, సాంబరాజు, సీఐ స్వామి, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్

ఖమ్మం సహకారనగర్: స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు బుధవారం రాత్రి 9గంటల నుంచి గురువారం ఉదయం 9గంటల వరకు సీనియారిటీ జాబితాలో ఉన్న ఎస్ఏలు వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించింది. జోనల్ స్థాయిలో 1,300 మందికి అవకాశముండగా, జిల్లాలో 70మంది హెచ్ఎంలుగా పదోన్నతి పొందనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి కల్పించనున్నారు.

కేఎంసీ డీసీగా శ్రీనివాసరావు

- మెప్మా పీడీగా నళిని.. వైరా కమిషనర్‌గా గురులింగం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. అలాగే, ఖమ్మం జిల్లా మెప్మా పీడీగా జి.నళినీ పద్మావతి, వైరా మున్సిపల్ కమిషనర్‌గా యు.గురులింగంను నియమించారు. గ్రేడ్–1 కమిషనర్ అయిన పి.శ్రీనివాసరావు పోస్టింగ్ కోసం వేచి ఉండగా, కేఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ నళినీ పద్మావతిని మెప్మా పీడీగా, నందికొండ కమిషనర్‌గా ఉన్న గురులింగంను వైరాకు, వైరా కమిషనర్ వేణును నందికొండకు కేటాయించారు.

అసైన్డ్ భూములకు హక్కులు కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈవిషయంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం త్వరలోనే జిల్లా కమిటీలను నియమించనున్నట్లు సమాచారం. ఆతర్వాత విధివిధానాలు విడుదలైతే స్పష్టత రానుంది. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ రకాల భూసమస్యలపై జిల్లాలో 73,689 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అసైన్డ్ భూములకు సంబంధించి సైతం ఉండగా.. రీ అసైన్ చేసేందుకు 4,707 మందిని అర్హులుగా తేల్చారు. మరో 1,677 మంది ఎలాంటి బదలాయింపు లేకుండా స్వయంగా భూములు అనుభవిస్తున్నట్లు గుర్తించారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

అసైన్డ్ హక్కు.. దక్కేలా!



దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి

- త్వరలోనే జిల్లా కమిటీల ఏర్పాటు
- రీఅసైన్‌మెంట్, బదలాయింపు లేని వారికి నోటీసులు

జీవనోపాధి కోసం..

భూమి లేని పేదలకు 1969 నుంచి బంజరు భూములు, అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వాలు కేటాయించాయి. ఈ భూముల్లో వ్యవసాయం, సంబంధిత పనులతో జీవనోపాధి పొందాలని పంపిణీ చేశారు. భూములను అసైన్డ్‌దారులు అనుభవించాలే తప్ప విక్రయించడం, దానం, బహుమతిగా ఇతరులకు ఇచ్చే అధికారం లేకుండా నిబంధనలు రూపొందించారు. కానీ చాలా మంది వ్యవసాయం చేసేందుకు ఆర్థిక ప్రతికూలత, భూమి విలువపై అవగాహన లేకపోవడం తదితర కారణాలతో ఇతరులకు విక్రయించారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా.. పట్టా లబ్ధిదారుల పేరిటే ఉన్నా భూమి మాత్రం చేతులు మారుతూ వచ్చింది.

చిగురించిన ఆశలు..

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించేలా ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకోవడంతో పలువురిలో ఆశలు చిగురించాయి. దశాబ్దాలుగా భూములపై ఎటువంటి హక్కు లేకున్నా అనుభవదారులుగా ఉన్న వారు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొందరికి భూమి ఉండగా.. మరికొందరికి పట్టాలే ఉన్నాయి. జిల్లాలో దాదాపు 12మందికి 5.56 ఎకరాలకు సంబంధించి పట్టా ఉన్నా భూమి లేదు. అంతేకాక అసైన్డ్ భూములు దశాబ్దాలుగా చేతులు మారి ఇప్పుడు కొన్నిచోట్ల పేదలే సాగు చేసుకుంటుండగా.. మరికొన్ని పెద్దల చేతుల్లోకి వెళ్లాయి. ఈమేరకు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 73,689 మంది భూసమస్యలపై దరఖాస్తులు ఇచ్చారు. వీటిద్వారా 4,707 మంది పేదలు 3,837.6525 ఎకరాల భూమి కలిగి ఉన్నట్లు తేలగా.. వీరు రీ అసైన్ పొందేందుకు అర్హులుగా అధికారులు గుర్తించారు. అలాగే, 1,677 మంది 1,406.1575 ఎకరాల భూమి అమ్మకుండా కుటుంబాల వద్దే ఉంది. ఈనేపథ్యాన అధికారులు అమ్మిన, కొనుగోలు చేసిన వారికి నోటీసులు జారీ చేయగా.. ఎవరెవరికి హక్కులు దక్కుతాయో ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాలను అనుసరించి తేలనుంది.

జిల్లా కమిటీలకు బాధ్యత

గతంలో రీ అసైన్‌మెంట్ కోసం ఎమ్మెల్యే చైర్మన్‌గా, ఆర్డీఓ కన్వీనర్‌గా అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి కమిటీలు ఉండేవి. 2017లో బీఆర్ఎస్ హయాంలో పీఓటీ చట్టాన్ని సవరించి రీ అసైన్‌మెంట్ అధికారాన్ని కలెక్టర్లకు అప్పగించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రక్రియను జిల్లాస్థాయి కమిటీలకు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా, కలెక్టర్ కన్వీనర్‌గా కమిటీ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈ కమిటీల నియామకంతో పాటే అసైన్‌మెంట్ భూముల కేటాయింపుపై విధివిధానాలు విడుదల చేసే అవకాశముంది. కాగా, సమస్యల పరిష్కారంలో కొన్ని చిక్కులు ఉండడంతో ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. తొలుత వివాదాలకు తావివ్వకుండా పట్టాలు లేకుండా సేద్యంలో ఉన్న భూములను అసైన్ చేయడం, అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన పేదలకు రీఅసైన్ చేయడం వంటివి పూర్తిచేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లా కమిటీలు కొత్తగా ప్రభుత్వ భూమి గుర్తింపుపైనా దృష్టి సారించి.. ఆ భూమిని అర్హులైన పేదలకు అసైన్ చేస్తారనే ప్రచారమూ ఉంది.

దరఖాస్తులు, అసైన్డ్ భూముల వివరాలు...

రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులు	అసైన్డ్ పట్టా ఉన్నా భూమి లేని వారు	రీ అసైన్‌మెంట్‌కు అర్హులు
73,689	12 మంది	4,707 మంది

రీ అసైన్‌మెంట్‌కు అర్హత ఉన్న భూమి	అసైన్‌మెంట్ భూముల అనుభవదారులు	అసైన్‌మెంట్‌దారుల చేతిలో భూమి
3,837 ఎకరాలు	1,677 మంది	1,406 ఎకరాలు

ప్రమాద దిశగా ప్రవాహం

భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ



భద్రాచలంలో గోదావరి ప్రవాహం

భద్రాచలం వద్ద గోదావరి ప్రమాద దిశగా ప్రవహిస్తోంది. మంగళవారం నెమ్మదిగా పెరిగిన నీటిమట్టం.. అర్ధరాత్రి నుంచి వేగం పుంజుకుంది. బుధవారం ఉదయం 8–15 గంటలకు నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో సబ్‌కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆతర్వాత వేగంగా పెరుగుతూ రాత్రి 10–05 గంటలకు 48 అడుగులు నమోదు కాగా, రెండో ప్రమాద హెచ్చరిక విడుదల చేశారు. గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యాన పరీవాహక ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈమేరకు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ భద్రాచలంతో పాటు దుమ్ముగూడెం మండలంలో పర్యటించారు. – భద్రాచలం

డైట్ ప్రిన్సిపాల్‌గా రాజేష్



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేష్

ఖమ్మం సహకారనగర్: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) డిప్యూటీ డైరెక్టర్ నాంపల్లి రాజేష్‌కు ఖమ్మం డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. తొలుత మహబూబ్‌నగర్ డైట్ ప్రిన్సిపాల్‌ను ఇక్కడకు కేటాయించగా ఆయన విధుల్లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేయలేదని తెలిసింది. దీంతో రాజేష్‌ను నియమించగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను డైట్ అధ్యాపకులు, ఉద్యోగులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.

మధిర కేంద్రంగా విద్యుత్ డివిజన్

- నియోజకవర్గాల వారీగా డివిజన్ల ఏర్పాటు
- కొత్తగా తిమ్మారావుపేట, బోనకల్ సబ్ డివిజన్లు కూడా..

ఖమ్మంవ్యవసాయం: నియోజకవర్గాల వారీగా విద్యుత్ డివిజన్లను ఏర్పాటు చేయడంలో భాగంగా జిల్లాలో మధిర డివిజన్ ఏర్పాటైంది. అలాగే, కొత్తగా రెండు సబ్ డివిజన్లను ఏర్పాటు చేస్తూ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు గాను ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, సత్తుపల్లి విద్యుత్ డివిజన్లు ఉన్నాయి. నియోజకవర్గానికొక డివిజన్ ఏర్పాటుచేయాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు వైరా డివిజన్‌లో సబ్ డివిజన్‌గా ఉన్న మధిర కేంద్రంగా కొత్త డివిజన్‌ను ఏర్పాటు చేశారు. ఈ డివిజన్‌కు 13 పోస్టులు సైతం మంజూరయ్యాయి. డీఈ, ఏఈ/ఏఏఈ ఒక్కొక్కరు, ఇద్దరేసి సబ్ ఇంజనీర్లు, జూనియర్ అకౌంట్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్లతో పాటు ఒక జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు సబార్డినేట్లు, ఒక వాచ్‌మెన్, ఒక ఎస్‌జీఎస్‌ఓ పోస్టు మంజూరు చేశారు. ఇందులో పలువురిని ఇతర డివిజన్ల నుంచి సర్దుబాటు చేయనున్నారు.

రెండు సబ్ డివిజన్ల ఏర్పాటు

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విద్యుత్ డివిజన్ల ఏర్పాటు క్రమంలో పలు సబ్ డివిజన్లను పునర్విభజించాల్సి వచ్చింది. దీంతో ఖమ్మం డివిజన్ పరిధిలో కొణిజర్ల మండలం పెద్దగోపతి సబ్ డివిజన్‌ను రద్దు చేయగా.. ఏన్కూరు మండలం తిమ్మారావుపేట(తల్లాడ సబ్ డివిజన్ నుంచి వేరు చేసి) కేంద్రంగా సబ్ డివిజన్ ఏర్పాటు చేశారు. ఇదే సమయాన పెద్దగోపతి, కొణిజర్ల సెక్షన్లను వైరా సబ్ డివిజన్‌లో కలిపారు. కాగా, తిమ్మారావుపేట సబ్ డివిజన్‌లో ఏన్కూరు, తిమ్మారావుపేట, కారేపల్లి, చీమలపాడు సెక్షన్లను చేర్చారు. అలాగే, ఖమ్మం టౌన్ డివిజన్ పరిధిలోని కొత్త లింగాల సబ్ డివిజన్‌ను రద్దు చేసి మధిర డివిజన్‌లో బోనకల్ సబ్ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. ఇది బోనకల్, నాగులవంచ, చింతకానితో ఏర్పాటైంది. ఫలితంగా కొత్త లింగాలను ఖమ్మం టౌన్ డివిజన్ పరిధి రఘునాథపాలెం సబ్ డివిజన్‌లో చేర్చారు. అలాగే, ఖమ్మం రూరల్(పాలేరు) విద్యుత్ డివిజన్ నుంచి ముదిగొండ సబ్ డివిజన్‌ను మధిర విద్యుత్ డివిజన్‌లోకి మార్చారు. కాగా, రద్దయిన పెద్దగోపతి, కొత్త లింగాల సబ్‌డివిజన్ల ఉద్యోగులను కొత్త సబ్ డివిజన్లకు కేటాయించారు.

పర్యాటక కేంద్రంగా రిజర్వాయర్

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వైరా రిజర్వాయర్, మత్స్య పరిశోధన కేంద్రం పరిశీలన



మత్స్య పరిశోధనా కేంద్రంలో చేపలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

వైరా: నిరంతరం నీటితో కళకళలాడే వైరా రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి పర్యాటక శాఖాధికారులు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. వైరా రిజర్వాయర్‌ను బుధవారం పరిశీలించిన ఆయన సమీప గుట్టలపై ఉన్న పర్యాటక శాఖ భవనాల వివరాలు ఆరా తీశారు. బోటింగ్ ప్రాంతం, ఆనకట్ట సమీపాన ప్రభుత్వ భూమిని పరిశీలించారు. బోటింగ్ ఏర్పాటు, కాటేజీల నిర్మాణం, పర్యాటక భవనం మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఆతర్వాత మత్స్య పరిశోధన కేంద్రాన్ని సైతం తనిఖీ చేసిన కలెక్టర్ ఈ ఏడాది చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యం, గంబూషియా చేప పిల్లల ఉత్పత్తి వివరాలు ఆరా తీశారు. ఫిషరీస్ ఏడీ శివప్రసాద్, జిల్లా పర్యాటక శాఖాధికారి సుమన్ చక్రవర్తి, వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ చింతా వేణు పాల్గొన్నారు.

నిబంధనలు విస్మరిస్తే చర్యలు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రైవేట్ వైద్యులు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన, శిక్షణలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చట్టానికి లోబడి ఆస్పత్రులను నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాక ధరల పట్టిక ప్రదర్శించాలని సూచించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలులో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, సంతాన సాఫల్య కేంద్రాల్లో నిబంధనలు పాటించాలని సూచించారు. అంతేకాక ఫైర్ సేఫ్టీ నిబంధనలు, సీజనల్ వ్యాధుల కట్టడిలో సహకారంపై కలెక్టర్ సూచనలు చేశారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లింపుపై హైకోర్టు ఇచ్చిన స్టేను మున్సిపాలిటీల్లోనూ అమలుచేయాలని కోరారు. డీఎంహెచ్ఓ కళావతిబాయి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్, ప్రోగ్రాం ఆఫీసర్లు చందునాయక్, వెంకటరమణ, టీఓటీ కల్పన తోరస్, ఎస్ఎంఓలు మురారి రాజేంద్రప్రసాద్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

రేపటి నుంచి 'పనుల జాతర'

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఈనెల 22వ తేదీన 'పనుల జాతర' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా పూర్తయిన పనులను ప్రారంభించడమే కాక కొత్త పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈమేరకు గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, సెగ్రిగేషన్ షెడ్లు, పశువుల కొట్టాలు, అజోలా పిట్ నిర్మాణాల ప్రారంభం, శంకుస్థాపన ఉంటాయని తెలిపారు. అలాగే, ఉపాధి హామీ పథకంలో ఎక్కువ రోజులు పని చేసిన వారు, పారిశుద్ధ్య కార్మికులు, హరిత సంరక్షకులకు సన్మానం ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు.

కిక్కు తగ్గుతుందా..?!

- నూతన ఎక్సైజ్ పాలసీపై మార్గదర్శకాలు జారీ
- ఈసారి ఏపీ వ్యాపారులు దూరమయ్యే అవకాశం



ఖమ్మంక్రైం: రాష్ట్ర ప్రభుత్వం వైన్స్ షాపుల టెండర్ నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసింది. నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లాలోని 122 వైన్ షాపులకు త్వరలో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ప్రస్తుత వైన్స్ గడువు నవంబర్‌తో ముగియనుండగా, అంతకుముందే రెండేళ్ల కాలానికి కొత్త షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించి టెండర్లు ఖరారు చేయనున్నారు.

దరఖాస్తు ఫీజు పెంపు

గతంలో వైన్స్ దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండగా ఈసారి రూ.3లక్షలకు పెంచారు. గత ఎక్సైజ్ పాలసీలో జిలాల్లోని 122 వైన్స్‌కు దరఖాస్తుల ద్వారా రూ.144.14 కోట్ల ఆదాయం నమోదైంది. మొత్తంగా 7,207 దరఖాస్తులతో రాష్ట్రంలోనే జిల్లా రెండో స్థానంలో నిలిచింది. అప్పుడు ఏపీ నుంచి ఎక్కువ మంది వ్యాపారులు పోటీ పడడంతో దరఖాస్తులు పెరగగా ఈసారి ఆ పరిస్థితి ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఏపీలో గత ప్రభుత్వం మద్యం వాడకాన్ని తగ్గించే ప్రయత్నంలో వైన్స్‌కు దరఖాస్తులు స్వీకరించకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించింది. దీంతో ఏపీకి సరిహద్దుగా ఉన్న ఖమ్మం జిల్లాలో వైన్స్ దక్కించుకునేందుకు అక్కడి వ్యాపారులు పోటీ పడ్డారు. కానీ ఈసారి అక్కడ తెలంగాణ మాదిరే ఎక్సైజ్ పాలసీ ఉండడంతో ఏపీ వ్యాపారులు పెద్దగా రాకపోవచ్చని భావిస్తున్నారు. దీనికి తోడు లైసెన్స్ ఫీజు పెరిగినందున దరఖాస్తులు, తద్వారా ఆదాయం తగ్గుతుందనే భావనతో అధికారులు ముందస్తు చర్యల్లో నిమగ్నమైనట్లు తెలిసింది. జిల్లాతో పాటు ఏపీలోని వ్యాపారులతో ఎక్సైజ్ అధికారులు ఇప్పటి నుంచే చర్చలు జరుపుతూ టెండర్లు దాఖలు చేసేలా ఒప్పిస్తున్నట్లు సమాచారం.

మిర్చి ధర పైపైకి...



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి

- రూ.15 వేల మార్క్ దాటిన ఎర్రబంగారం
- నిల్వ మిర్చికి అనూహ్యమైన డిమాండ్

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధరలో ఒక్కసారిగా పెరుగుదల నమోదైంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కొద్ది రోజులుగా క్వింటాకు రూ.14,500గా ఉన్న ధర బుధవారం రూ.15,300కు చేరింది. ఒకేరోజు క్వింటాకు రూ.800 పెరగడం విశేషం. పంట సీజన్ మార్చి, ఏప్రిల్‌లో సగటున రూ.13,500 నుంచి రూ.14వేలు పలికిన ధర క్రమంగా తగ్గుతూ మే, జూన్‌లో రూ.12,500కు పడిపోయింది. అయితే, గత ఏడాది రూ.18 నుంచి రూ.20 వేల ధర ఉండడంతో ఈసారి సైతం అన్‌సీజన్‌లో పెరుగుతుందనే భావనతో రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు. అయినా ధర పతనమవడం.. వానాకాలం పంటల పెట్టుబడికి నగదు అవసరం కావడంతో రైతులు నిల్వ మిర్చిని విక్రయించారు. ఫలితంగా పెట్టుబడి రాకపోగా, నిల్వ చేసిన ఖర్చు సైతం నష్టపోయారు.

ఎందుకు పెరుగుతుందంటే...

మిర్చి ధర ఒకేసారి రూ.800 పెరగడంపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ఇక్కడ పండించే 'తేజా' రకం మిర్చిని చైనా దేశానికి ఎగుమతి చేస్తారు. కానీ చైనాలోనూ ఈ రకం మిర్చి సాగవడంతో డిమాండ్ తగ్గి ధరపై ప్రభావం చూపింది. ఇదే సమయాన మిర్చి ధర ఆశించిన స్థాయిలో లేక రైతులు ఈ ఏడాది మిర్చి సాగు తగ్గిస్తున్నారనే ప్రచారం మొదలైంది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా వ్యాపారులు ధర పెంచారని కొందరు చెబుతున్నారు. దీనికి తోడు చైనాలోనూ ఈ ఏడాది మిర్చి సాగు తగ్గి ఎగుమతుల ఆర్డర్లు వస్తున్నాయని తెలిసింది.

రూ.15వేల చొప్పున విక్రయించా



పంటల సాగుకు పెట్టుబడి కోసం మిర్చిని విక్రయానికి తీసుకొచ్చా. మంగళవారం రూ.14,550 ధర పలకడంతో అదే ధర వస్తుందని భావించా. కానీ అనుకోకుండా రూ.15వేల ధర పెట్టారు. దీంతో నిల్వ చేసిన 61 బస్తాల మిర్చి విక్రయించా.

– హుస్సేన్ సాహెబ్, చిట్యాల, ఎన్టీఆర్ జిల్లా, ఏపీ

ఆర్డర్లు పెరిగితే మరింత ధర



విదేశీ ఆర్డర్లు పెరిగితే మిర్చి ధర పుంజుకునే అవకాశముంది. ప్రధానంగా చైనా నుంచి ఆర్డర్లతో ధరలో పురోగతి ఉంటుంది. ఇప్పుడు రూ.15,300కు చేరినా ముమ్ముందు ఎలా ఉంటుందో చూడాలి. ధరతో పాటే విక్రయాలు గణనీయంగా పెరుగుతాయి.

– యర్లపల్లి సతీష్, చాంబర్ ఆఫ్ కామర్స్, ఖమ్మం

ఇదికాక నిల్వ మిర్చి విక్రయాలు పెరిగేలా వ్యాపారులే ధర పెంచారనే చర్చ సైతం జరుగుతోంది. కారణాలు ఏవైనా మిర్చి క్వింటా ధర రూ.16 వేలకు చేరితే నిల్వ సరుకు విక్రయాలు గణనీయంగా పెరిగే అవకాశముంది.

జిల్లాలో భారీగా నిల్వలు

రైతులు గత ఏడాది సాగు చేసిన మిర్చికి సరైన ధర లేక భారీగా నిల్వ చేశారు. జిల్లాలో మొత్తం 48 కోల్డ్ స్టోరేజీలు ఉండగా.. దాదాపు 48 లక్షల బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు అంచనా. ఇందులో ఇటీవల 20 శాతం మేర విక్రయించినా ఇంకా 80 శాతం సరుకు ఉందని అంచనా వేస్తున్నారు. క్వింటా ధర రూ.15 వేలు దాటడంతో విక్రయాలు ఊపందుకుంటుండగా.. రూ.16 వేలకు చేరితే మరింత జోరందుకునే అవకాశముందని విశ్లేషిస్తున్నారు.

క్లుప్తంగా

స్టడీటూర్‌కు బయలుదేరిన కేఎంసీ పాలకవర్గం


కేఎంసీ వద్ద మేయర్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఇండోర్‌లో స్టడీ టూర్‌కు బుధవారం బయలుదేరింది. ఈమేరకు సాయంత్రం వారు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ చేరుకున్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా ఆధ్వర్యాన రెండు రోజుల పాటు సాగే స్టడీ టూర్‌లో కార్పొరేటర్లు, అధికారులు పాల్గొంటారు.

ఖమ్మం వాసి నౌరీన్‌కు డాక్టరేట్


మహమ్మద్ నౌరీన్

ఖమ్మం అర్బన్: ఖమ్మంకు చెందిన మహమ్మద్ నౌరీన్ తెలుగు విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. 'ముస్లిం మైనార్టీ కథలు – సాంస్కృతిక అంశాల అధ్యయనం' అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీనుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఓయూ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ నారాయణన్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న నౌరీన్ మాట్లాడుతూ గైడ్ డాక్టర్ నాళేశ్వరం శంకరం, తన భర్త సమీర్ పాషా సహకారంతో పరిశోధన పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మెదక్ టీజీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఆమెను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శిరీష, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టులో జిల్లా క్రీడాకారిణి


హన్సినీ

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–15 బాలికల వాలీబాల్ పోటీల్లో ఖమ్మంకు చెందిన జి.డి.హన్సినీ ప్రతిభ చాటింది. దీంతో పూణేలో జరగనున్న జాతీయస్థాయి అండర్–15 బాలికల టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఆమెను ఎంపిక చేశారు. ఖమ్మంలోని హార్వెస్ట్ స్కూల్‌లో చదువుతున్న హన్సినీ సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతుండగా, డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి అభినందించారు.

డీఈఈలు, ఈఈలకు అదనపు బాధ్యతలు

ఖమ్మంఅర్బన్: జల వనరుల శాఖలో ఖాళీగా ఉన్న స్థానాల్లో డీఈఈలు, ఈఈలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 43 మందికి అదనపు బాధ్యతలు కేటాయించగా జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఉన్నారు. తిరుమలాయపాలెం డీఈఈ రమేశ్‌రెడ్డికి పాలేరు ఈఈగా, ఖమ్మం సీఈ కార్యాలయంలో డీఈ కె.శోభారాణికి అదే కార్యాలయంలో డీసీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే, సత్తుపల్లి ఈఈ ఎస్.శ్రీనివాస్‌రెడ్డికి కల్లూరు డీఎస్ఈగా, మధిర డీఈఈ రాంప్రసాద్‌కు మధిర ఈఈగా బాధ్యతలుఅప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంతేకాక భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఈఈ బి.అర్జున్‌కు ఆ జిల్లా డీసీఈగా, ఇల్లెందు డీఈఈ బి.కృష్ణకు ఇల్లెందు ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎట్టకేలకు 'సుడా' ముసాయిదా

- కలెక్టరేట్, కేఎంసీల్లో మాస్టర్ ప్లాన్ మ్యాప్‌లు
- మండల, గ్రామ కార్యాలయాల్లో మాత్రం కరువు
- ప్లాన్ అమలు కార్యాచరణపై తలెత్తుతున్న ప్రశ్నలు


కేఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సుడా ముసాయిదా ప్లాన్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరం, పరిసర ప్రాంతాల భవిష్యత్‌ను నిర్దేశించే స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) మాస్టర్ ప్లాన్ ముసాయిదాను అధికారులు ఎట్టకేలకు విడుదల చేశారు. దీంతో 2021లో ప్రారంభమైన ప్రక్రియ ఇప్పుడు తుది రూపుకు చేరినట్లయింది. మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై ప్రజల నుండి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు మ్యాప్‌లను కలెక్టరేట్, కేఎంసీ కార్యాలయంలో ప్రదర్శించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మండలాల పరిధి 45 గ్రామపంచాయతీలను కలుపుకుని అధికారులు మాస్టర్ ప్లాన్ ముసాయిదాను రూపొందించారు.

571.83 చ.కి.మీ. విస్తీర్ణంలో..

2024 అక్టోబర్‌లో సుడా పరిధిని విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సుడా పరిధి 571.83 చ.కి.మీ. విస్తరించి ఉండగా.. కేఎంసీతో పాటు ఏడు మండలాల పరిధిలోని 45 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పరిధితోనే ప్రస్తుత మాస్టర్ ప్లాన్ ముసాయిదా రూపొందించారు. దీనిపై అధికారులు 90 రోజుల పాటు అభ్యంతరాలు, సూచనలను స్వీకరిస్తారు.

పాలకవర్గం, ఉద్యోగులు ఎక్కడ?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అంతకుముందు 'సుడా'కు ఉన్న పాలకవర్గాన్ని 2023 డిసెంబర్‌లోనే రద్దు చేసింది. ఆతర్వాత కొత్త పాలకవర్గాన్ని నియమించకపోగా.. ఉద్యోగుల పోస్టులు సైతం కేటాయించలేదు. కేఎంసీ కమిషనర్ సుడా వైస్ చైర్మన్‌గా ఉండడంతో కేఎంసీ ఉద్యోగులతోనే పని చేయిస్తున్నారు. ఇప్పటికే కేఎంసీ టౌన్ ప్లానింగ్‌లో ఉద్యోగుల కొరత వేధిస్తుంటే.. ఉన్న వారిపై 'సుడా' భారం అదనంగా పడినట్లయింది. ఈ నేపథ్యాన సుడా అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని.. తాత్కాలిక ఏర్పాట్లతో భూసేకరణ, ప్రాజెక్టుల అమలు, అభివృద్ధి జరుగుతుందా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పరిశీలన, పర్యవేక్షణపై నీలినీడలు

మాస్టర్ ప్లాన్ అంటే కేవలం రోడ్లు, భవనాల నిర్మాణమే కాదు నగర జీవనానికి కీలకమైన సహజ వనరుల పరిరక్షణ కూడా తప్పనిసరి. ఖమ్మం చుట్టుపక్కల అనేక చెరువులు, డొంక రోడ్లు కబ్జాకు గురవుతున్నాయి. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. 'సుడా' ఉద్యోగుల కొరతతో క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించే పరిస్థితులు లేక కబ్జాలు సర్వసాధారణమయ్యాయి. ఇక కొత్తగా అమలుచేయనున్న మాస్టర్ ప్లాన్‌లో కనీసం 30 అడుగుల రోడ్డు ఉంటేనే నిర్మాణ అనుమతులు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ ఈ విషయంలో పరిశీలించే సిబ్బంది నియామకంపై మాత్రం పురోగతి కానరాకపోవడం గమనార్హం.

ముసాయిదాపై పెదవి విరుపు

భూముల విలువ పెంపు, సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం, భవిష్యత్ తరాలకు సుస్థిరమైన నగరాన్ని అందించే లక్ష్యంతో మాస్టర్ ప్లాన్ ముసాయిదా రూపొందించారు. కానీ ప్లాన్ ఆ స్థాయిలో లేకపోగా.. అభ్యంతరాల స్వీకరణలోనూ పారదర్శకత పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. 'సుడా' ఏడు మండలాల పరిధిలో విస్తరించి ఉంటే ముసాయిదా మ్యాప్‌ను కేవలం కేఎంసీ, కలెక్టరేట్‌లో ఏర్పాటుచేయడం ఈ విమర్శలకు కారణమవుతోంది. మండల కేంద్రాల్లోని అన్ని కార్యాలయాల్లోనూ ప్లాన్‌ను విడుదల చేస్తే ఫలితం ఉండేదని చెబుతున్నారు. అలా చేయకపోవడంతో నామమాత్రంగానే అభ్యంతరాలు అందుతుండగా.. తుది ప్లాన్ ఎలా ఉంటుందోనన్న విమర్శలు వస్తున్నాయి.

రాజీవ్ సేవలు మరువలేనివి..


రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: భారతరత్న, మాజీ ప్రధాని మంత్రి రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. రాజీవ్ జయంతి సందర్భంగా బుధవారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. దేశ భవిష్యత్ దృష్ట్యా దూరదృష్టితో రాజీవ్‌గాంధీ తీసుకున్న నిర్ణయాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వరణకుమారి, నాయకులు నాగండ్ల దీపక్‌చౌదరి, బాలగంగాధర్ తిలక్, వద్దెబోయిన నర్సింహారావు, గజ్జెల్లి వెంకన్న, దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, సయ్యద్ గౌస్, పుచ్చకాయల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

మరింత వేగంగా ఇళ్ల నిర్మాణం


బోనకల్ : నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

బోనకల్/ఎర్రుపాలెం/చింతకాని: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. బోనకల్, ఎర్రుపాలెం, చింతకాని మండలాల్లో నిర్మాణాలను బుధవారం ఆమె పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు వేగంగా చేపడుతుంటే బిల్లులు త్వరగా మంజూరవుతాయని తెలిపారు. అలాగే, సీజనల్ వ్యాధుల కట్టడిపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. నాగులవంచలో ఆరోగ్య కేంద్రం, పాఠశాలను డీపీఓ తనిఖీ చేశారు. ఎంపీఓలు శాస్త్రి, జి.శ్రీలక్ష్మి, పర్వీన్ ఖైసర్, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి


కొణిజర్ల : మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

చింతకాని/కొణిజర్ల: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరుగుతున్న గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులకే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చింతకాని మండలం పాతర్లపాడులో బుధవారం జరిగిన దేవసాని వీరకృష్ణ సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీల తీరుతో ఆర్థికంగా ఉన్న వారికే ఇళ్లు దక్కాయని ఆరోపించారు. ఈమేరకు నిరుపేదలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం స్పందించాలన్నారు. అలాగే, కొణిజర్లలో జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల వర్షాలతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించినందున అధికారులు స్పందించాలని, యూరియా కొరత రాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈసమావేశాల్లో సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, సామినేని రామారావు, మునుకుంట్ల సుబ్బారావు, మడుపల్లి గోపాలరావు, రాచబంటి రాము, చింతపల్లి ప్రసాద్, తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య, చెరుకుమల్లి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి


సమావేశంలో పాల్గొన్న ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్లు

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని చెందిన 12 ఇంజనీరింగ్ కళాశాలలకు సుమారు రూ.24 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నందున తక్షణమే చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు కోరాయి. వివిధ కళాశాలల చైర్మన్లు గుండాల కృష్ణ, చలసాని సాంబశివరావు, శ్రీధర్, నవీన్, భరత్, కిరణ్, రాజేశ్వరరావు, మణి, దాసరి ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్ ఖలామ్ తదితరులు బుధవారం ఖమ్మంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం మంత్రులు, వామపక్ష పార్టీల కార్యదర్శులను కలవాలని నిర్ణయించామని చెప్పారు. బకాయిలు పేరుకుపోవడంతో యాజమాన్యాలపైనే కాక విద్యార్థులతో ఒత్తిడి పెరుగుతున్నందున ప్రభుత్వం స్పందించాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు

ఐదు షాపుల నిర్వాహకులపై కేసు

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంక్రైం/రఘునాథపాలెం: ఎరువుల విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తున్నారనే ఫిర్యాదుతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు బుధవారం తనిఖీ చేపట్టాయి. యూరియా ఇవ్వాలంటే ఇతర ఎరువులు కొనాలని సూచిస్తుండడం, స్టాక్ ఉన్నా బ్లాక్ చేస్తూ ధర పెంచుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా నేలకొండపల్లిలోని లక్ష్మీ ప్రసన్న ఫెర్టిలైజర్స్, రఘునాథపాలెం మండలం మంచుకొండలోని న్యూ కుమార్ ఫెర్టిలైజర్స్‌తో పాటు చింతకాని మండలం నాగులవంచ, సత్తుపల్లిలోని మూడు షాపుల్లో అక్రమాలు నిజమేనని నిర్ధారించారు. ఈమేరకు ఆయా షాపుల నిర్వాహకులపై తమకు అందిన ఫిర్యాదుతో కేసులు నమోదు చేశామని సీపీ సునీల్‌దత్ తెలిపారు. కాగా, పూర్తిస్థాయిలో విచారణ అనంతరం ఆయా షాపుల లైసెన్స్ రద్దు చేసే అవకాశముందని సమాచారం.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

ఖమ్మం సహకారనగర్: వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మంలోని ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈపోటీలను డీఐఈఓ రవిబాబు ప్రారంభించారు. పోటీల్లో షేక్ సమీర్‌పాషా, దేవిశ్రీ ప్రసన్న(ఏఎస్ఆర్) మొదటి స్థానంలో నిలవగా హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆతర్వాత స్థానాల్లో కోమలి జోషి, రామ్‌చరణ్(కూసుమంచి), భవానీప్రియ, మహాలక్ష్మి(వైరా), శ్రీవాత్సవ, అఫ్నన్(హార్వెస్ట్ కళాశాల) నిలిచారని ఏఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు.

గణపతి ఉత్సవాల్లో అప్రమత్తత

ఖమ్మంవ్యవసాయం: గణపతి ఉత్సవాలు సమీపిస్తుండడంతో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. హనుమకొండ నుంచి వీసీ ద్వారా బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. మండపాల ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించి విగ్రహాల ఎత్తు, అక్కడి విద్యుత్ లైన్ల పరిస్థితులకు సూచనలు చేయాలని తెలిపారు. ఎత్తయిన విగ్రహాల తరలింపు సమయాన తీగలకు తగలకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మండపాల వద్ద ఇనుప ఫ్రేమ్‌ల వినియోగాన్ని తగ్గించడం, నాణ్యత కలిగిన పరికరాల వాడకం, సమస్యలు ఎదురైతే సిబ్బందికి సమాచారం ఇచ్చేలా నిర్వాహకులకు సూచనలు చేయాలని సీఎండీ ఆదేశించారు.

కొబ్బరితోటల పెంపకంపై శిక్షణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొబ్బరి తోటల పెంపకం, యాజమాన్య పద్ధతులపై కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యాన రైతులకు శిక్షణ ఇచ్చారు. చుంచుపల్లిమండలం గరిమెళ్లపాడులోని ఉద్యాన నర్సరీలో బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణకు కోకోనట్‌బోర్డు డీడీ మంజునాథ్‌రెడ్డి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఉద్యాన అధికారులు మధుసూదన్, జంగా కిశోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు అమలు చేస్తున్న పథకాలు, సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను అధికారులకు అందజేయాలని సూచించారు.

ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తిగా అఖిల

ఖమ్మం లీగల్: ఖమ్మం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తిగా గొడిసెల అఖిల నియమితులయ్యారు. ఈమేరకు హైకోర్టు నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆగస్టు 28వరకు బీఏఎస్ దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో 3, 5, 8వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి కోయ, గోండు, నాయకపోడు, తదితర గిరిజన విద్యార్థులు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఒక ప్రకటనలో సూచించారు. ఖమ్మం జిల్లాలోని పాఠశాలల్లో 3వ తరగతిలో నాలుగు, ఐదు, ఎనిమిదో తరగతుల్లో రెండేసి సీట్లు మిగిలినందున భర్తీ చేయనున్నామని తెలిపారు. ఈమేరకు అందిన దరఖాస్తుల నుంచి ఈనెల 30న లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని, ఒక కుటుంబం నుంచి ఒకరికే దరఖాస్తుకు అర్హత ఉంటుందని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు కలిగిన వారు కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, గత సంవత్సరం స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్‌లతో డీడీ కార్యాలయంలోదరఖాస్తు చేసుకోవాలని పీఓ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై మండలంలోని గంగబండతండా ఫ్లైఓవర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాలు... కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం చెన్నంశెట్టిపల్లికి చెందిన బోయ తిరుమలేష్(22) బొలేరో వాహనంలో మంగళవారం రాత్రి మిర్చి లోడు తీసుకుని ఖమ్మం వస్తున్నాడు. ఈక్రమాన ఫ్లైఓవర్‌పై రహదారి మరమ్మతుల కారణంగా ఏర్పాటుచేసిన సూచిక బోర్డులను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో వాహనం నడుపుతున్న తిరుమలేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మధిర: మధిర సమీపాన వైరా నదిలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం ఉదయం గుర్తించారు. మడుపల్లికి చెందిన పెసరమల్లి వినోద్(28) చేపలు పట్టేందుకు మంగళవారం వైరా నదికి వెళ్లి గల్లంతయ్యాడు. ఈమేరకు బుధవారం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యాన గాలించగా ఆయన మృతదేహం లభించింది. ఘటనపై వినోద్ కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

ఖమ్మంరూరల్: నిత్యం సెల్‌ఫోన్ చూస్తూ కాలం గడుపుతున్న యువకుడిని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం అర్బన్ మండలం టేకులపల్లికి చెందిన ధనుష్ ఐటీఐ చదువుతున్నాడు. ఆయన నిత్యం నిత్యం సెల్‌ఫోన్ చూస్తూ కాలం గడుపుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈనెల14న ఇంటి నుండి వెళ్లిపోయిన ధనుష్ ఖమ్మం రూరల్ మండలం పెద తండాకు చేరుకున్నాడు. అక్కడ ఎలుకల మందు తాగి అపస్మారక స్థితికి చేరగా తెలిసిన వ్యక్తికి చెప్పడంతో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై ధనుష్ తండ్రి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేశామని సీఐ ముష్క రాజు తెలిపారు.

ఒంటరితనం భరించలేక..


వెంకటసాయిరామ్ (ఫైల్)

పాల్వంచ: ఒంటరితనం భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చెందిన సుగ్గాల వెంకటసాయిరామ్ (36) శాస్త్రీరోడ్‌లోని పద్మజ ఫ్యాన్సీలో వర్కర్‌గా ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. గట్టాయిగూడెంలో అద్దెకు ఉంటున్నాడు. అతని తల్లి చిన్నప్పుడే చనిపోగా, తండ్రి అనారోగ్యంతో మూడేళ్ల కిందట చనిపోయాడు. ఒంటరితనంతో మానసికంగా కృంగిపోయాడు. గత 15వ తేదీన ఆరోగ్యం బాగోలేదని దుకాణానికి రానని చెప్పాడు. బుధవారం తాను ఉంటున్న గది నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు తలుపులు తీసి చూడగా, ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నాడు. ఒంటరితనం భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని బంధువు మహిపతి లవరావు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిల్లుల్లో అధికారుల తనిఖీ

ఖమ్మం సహకారనగర్: వానాకాలానికి సంబంధించి లక్ష్యం మేర సీఎంఆర్‌ను మిల్లర్లు సకాలంలో ఇవ్వాలని హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యుడు అంజయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ సూచించారు. జిల్లాలోని ముదిగొండ, తదితర మండలాల్లో మిల్లులను బుధవారం వారు తనిఖీ చేసి మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్లు నాగలక్ష్మీ, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా 419 సీట్లు భర్తీ


విద్యార్థికి ప్రవేశపత్రం అందజేస్తున్న ఆర్‌సీఓ అరుణకుమారి

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సీట్ల భర్తీకి బుధవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలంలోని గిరిజన గురుకుల కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 419 సీట్లు భర్తీ అయ్యాయని గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ అరుణకుమారి తెలిపారు. గురుకుల విద్యాలయాల్లో ఐదు నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించగా బాలికలు 121 మంది, బాలురు 298 మంది చేరారని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని పలు గురుకులాల ప్రిన్సిపాళ్లు రమాదేవి, రాణి, చైతన్య, మాధవీలత, శిరీష, మాధవి, వీరస్వామి, సురేశ్, శ్యాంకుమార్, హరికృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

సీపీఎస్ ఈయూ ఆధ్వర్యాన నేడు ముఖాముఖి

ఖమ్మంసహకారనగర్: వీఆర్వోలు, వీఆర్ఏలుగా విధులు నిర్వర్తించి ఇతర శాఖలకు కేటాయించిన వారితో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీ సీపీఎస్ ఈయూ) ఆధ్వర్యాన గురువారం ముఖాముఖి నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు కొత్తగూడెం కలెక్టరేట్‌లో, మధ్యాహ్నం 3గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో, ఆ తర్వాత ఆర్డీఓ కార్యాలయంలో ముఖాముఖి ఉంటుందని జీపీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు తెలిపారు. సమావేశాల్లో టీజీ ఈ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, టీజీసీపీఎస్ ఈయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.రామకృష్ణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొంటారని వెల్లడించారు.